# ఎరువుల పంపిణీ పారదర్శకంగా జరగాలి

**ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా నమోదైన రైతులకే ఎరువులు అందించాలి**

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**

**జేడీఏ సుబ్రహ్మణ్యేశ్వరరావు**



**వేంపల్లె,జూన్08.అక్షర టైమ్స్:-** వ్యవసాయ శాఖ చేపట్టిన పారదర్శక ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు ఎం. సుబ్రహ్మణ్యేశ్వరరావు సూచించారు. సోమవారం పులివెందుల, వేంపల్లె మండలాల్లోని పలు ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా రైతులకు సబ్సిడీ ఎరువులను పారదర్శకంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలు, విస్తీర్ణం ఆధారంగా యూరియా, డీఏపీ తదితర ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే అందించాలని ఎరువుల దుకాణదారులకు ఆదేశించారు. రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు ఎరువుల దుకాణాలు, సహకార సంఘాల ద్వారా ఏపీ ఎయిమ్స్ యాప్‌లో నమోదు చేసిన రైతులకు మాత్రమే నిర్దేశిత మోతాదులో ఎరువులు పంపిణీ చేయాలని సూచించారు. యాప్‌ను తప్పనిసరిగా వినియోగిస్తూ ఎరువుల పంపిణీ చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ సహాయ సంచాలకురాలు (ఏడీ) మాధవి, టెక్నికల్ వ్యవసాయ అధికారి సుమంత్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారులు చెన్నారెడ్డి, బాలగంగాధర్‌రెడ్డి, ఏఈఓ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

# టెట్ నుండి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఉపశమనం కల్పించాలి

**యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు**

**మాదన విజయ కుమార్ డిమాండ్**

**బద్వేల్,జూన్08.అక్షర టైమ్స్:-** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు సైతం టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలనే సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఉపశమనం కల్పించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని చట్ట సవరణ చేపట్టడమే సమస్యకు ఏకైక పరిష్కారమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పోరుమామిళ్ల పట్టణం లోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆ సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాబోధనలో అపార అనుభవం ఉన్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను సైతం టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలని, లేకపోతే పదోన్నతులు లభించకపోవడంతో పాటు, 2028 ఆగస్టు తర్వాత స్వచ్ఛంద పదవీ విరమణ చేపట్టాలని సుప్రీంకోర్టు తీర్పునివ్వడం దురదృష్టకరమన్నారు. జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్సీటిఈ) 2011 నుండి ఉపాధ్యాయ నియమాకాలకు టెట్ ను అర్హత పరీక్షగా ప్రవేశపెట్టిందని, ఆ మేరకు 2012 డీఎస్సీ నుండి ఎంపికైన ఉపాధ్యాయులందరూ టెట్ లో సైతం ఉత్తీర్ణత సాధించి, ఉపాధ్యాయులుగా నియమకాలు పొందారన్నారు. అయితే 2012కు ముందు ఉద్యోగ నియమకాలు పొందిన ఉపాధ్యాయులు సైతం టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలనే సుప్రీంకోర్టు తీర్పు దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఉపాధ్యాయులను ఆందోళనలోకి నెట్టివేయడమే కాకుండా, ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రతను ప్రశ్నార్థకంగా మార్చివేసిందన్నారు. 30 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులను సైతం టెట్ పరీక్ష ఉత్తీర్ణత పొందాలనడం వల్ల ఉపాధ్యాయులు మానసిక వేదనకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్య హక్కు చట్టం 23 (1) లో సవరణ చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఒక ప్రక్క పాఠశాలల్లో విద్యాబోధన చేస్తూ, మరో పక్క ఉపాధ్యాయులు పరీక్షలు రాయటానికి సన్నద్ధం కావడం సాధ్యమయ్యే పనేనా అని ఆయన ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయులలో నెలకొని ఉన్న ఆందోళనను తొలగించడానికి పార్లమెంట్ లో విద్యాహక్కు చట్టానికి చట్ట సవరణ చేసేందుకు ప్రయత్నిస్తూనే, మరో ప్రక్క చట్ట సవరణ జరిగే వరకు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఏడాదికి రెండు మార్లు ప్రత్యేకంగా టెట్ పరీక్షలు నిర్వహించాలని, ఈ పరీక్షలలో ఉపాధ్యాయులందరికీ సమానంగా ఉత్తీర్ణతకు 35 మార్కులను అర్హతగా నిర్ణయించాలని కోరారు. అలాగే సిలబస్ లో మార్పులు చేసి ఉపాధ్యాయిని సబ్జెక్టు ఆధారంగా అదే సబ్జెక్టులోని ప్రశ్నలను రూపొందించి పరీక్షలు నిర్వహించాలని ఆయన కోరారు. విద్య హక్కు చట్టం 23 (1)లో సవరణ చేయాలని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక నిర్వహించాలని డిమాండ్ చేస్తూ జూన్ 10 నుండి 12 వరకు పాఠశాల విద్యాశాఖాధికారులకు ప్రాతినిధ్యాలు చేపట్టడం, జూన్ 13 నుండి 16 వరకు శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, మంత్రులకు ప్రాతినిధ్యాలు చేయడం, జూన్ 30వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిరసన చేపట్టడం, జూలై 2వ తేదీ జిల్లా కేంద్రాల్లో నిరాహార దీక్ష, జూలై 15వ తేదీ రాష్ట్ర కేంద్రంలో నిరాహార దీక్ష చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆయన విమర్శించారు. 12వ పిఆర్సీ అమలు, పెండింగ్ డిఏ ల విడుదల, ఆర్థిక బకాయిల చెల్లింపు, సిపిఎస్ రద్దు పాత పెన్షన్ అమలు లాంటి తదితర సమస్యల పరిష్కారించాలని ఆయన కోరారు. జూన్ 12వ తేదీ నుండి పాఠశాలలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, నోట్ పుస్తకాలను, సమరూప దుస్తులను సకాలంలో అందజేయాలన్నారు. తక్షణమే పదోన్నతులు చేపట్టి ఉన్నత పాఠశాలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కుర్రా చెన్నయ్య, కె.సుధాకర్, జిల్లా మాజీ కార్యదర్శి కె.జోజయ్య, కాశి నాయన మండల అధ్యక్షులు బి.భాస్కర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# తహసిల్దార్‌ను సన్మానించిన జనసేన పార్టీ నేత పోతిరెడ్డి చలపతి



**వేంపల్లె,జూన్08.అక్షర టైమ్స్:-** వేంపల్లె తహసిల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా శివశంకర్‌రెడ్డిని జనసేన పార్టీ నేత పోతిరెడ్డి వెంకట చలపతి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోతిరెడ్డి వెంకట చలపతి మాట్లాడుతూ రెవెన్యూ శాఖ పరిధిలోని ప్రజా సమస్యలను సత్వరంగా పరిష్కరించడంతో పాటు భూ సంబంధిత అంశాలు, పాస్‌బుక్‌లు, వివిధ ధృవపత్రాల జారీ ప్రక్రియలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన తహసిల్దార్ జిల్లా శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శక పరిపాలన అందించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మారుతి, సూర్యనారాయణ, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్



**బద్వేల్,జూన్08.అక్షర టైమ్స్:-** బద్వేల్ పట్టణం సిద్ధవటం రోడ్డు లో ఉన్నటువంటి స్వేచ్ఛ యోగ అండ్ కరాటే అకాడమీ నందు సోమవారం జరిగినటువంటి కరాటే బెల్ట్ గ్రేడింగ్ లో మాస్టర్ జాహ్నవి ఆధ్వర్యంలో విద్యార్థులు పాల్గొని వివిధ రకాల బెల్టులు సాధించారని మాస్టర్ యన్.దయాకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బద్వేల్ మండల వెటర్నటి డాక్టర్ యం.లక్ష్మీ నరసయ్య పాల్గొని విద్యార్థులకు బెల్టులు సర్టిఫికెట్లు అందించారు.ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులందరూ పిల్లలకు కరాటే నేర్పించాలని ,కరాటే నేర్చుకోవడం వల్ల పిల్లలు మానసికంగా, శారీరకంగా చాలా దృఢంగా ఉంటారని అది వారి చదువుకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని, చాలా క్రమశిక్షణగా ఉంటారని తెలిపారు. అలాగే ఇప్పుడు ఉన్నటువంటి పరిస్థితులలో ఈ కరాటే అత్యంత అవసరమన్నారు.దీనిని తల్లిదండ్రులు ప్రోత్సహించి ప్రతి పిల్లలకి నేర్పించాలని తెలిపారు.

# బ్రహ్మంగారిమఠం వ్యాపార సముదాయాల ముందు పరిశుభ్రం చేయాలి

**రామాలయం దగ్గర నుండి ఐదు రోడ్ల సెంటర్ వరకు సమాంతరంగా సిసి రోడ్డును ఏర్పాటు చేయాలి**

**భద్రతా చర్యలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు,5రోడ్ల సెంటర్ నందు ఔట్ పోస్ట్ పోలీస్ స్టేషన్,కానిస్టేబుల్ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలి**

**సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శివకుమార్ డిమాండ్**

**వ్యాపార సముదాయముల ముందు అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతంలో పర్యటించిన సిపిఎం బృందం**



**బ్రహ్మంగారిమఠం,జూన్08.అక్షర టైమ్స్:-** పుణ్య క్షేత్రమైన బ్రహ్మంగారి మఠంలోని వ్యాపార సముదాయాల ముందు శుభ్రం చేసి సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం బ్రహ్మంగారిమఠంలోని దేవస్థానం ముందున్న ప్రధాన వీధిలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పర్యటించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ తో కలసి విలేకరులతో మాట్లాడుతూ....మఠం అభివృద్ధి లో భాగంగా దేవస్థానం పరిధిలో అనేక సంవత్సరాలుగా ఉన్న అంగళ్లను తొలగించి వారందరికీ నూతనంగా వ్యాపార సముదాయం కోసం స్థలాన్ని ఇవ్వడం జరిగిందని వారశీదరు తమ స్వంత డబ్బులతో అంగళ్లను నిర్మించుకున్నారని ఆరాధన మహోత్సవాలు అయిన వెంటనే వారందరూ అందులో చేరారని అయితే పాత అంగళ్లను తొలగించిన ప్రాంతంలో పెద్ద ఎత్తున మట్టి, రాళ్ళతో అపరిశుభ్రంగా ఉందని దీనివల్ల భక్తులు యాత్రికులు అంగళ్ల దగ్గరికి వెళ్లాలంటే ఇబ్బందికరంగా తయారయిందని వారు తెలిపారు. దీనివల్ల వ్యాపారస్తులకు వ్యాపారాలు కూడా సరిగ్గా జరగటం లేదని కావున దేవస్థానం మఠాధిపతి, జోక్యం చేసుకొని అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని అంతా పరిశుభ్రం చేయించి రామాలయం దగ్గర నుండి 5,రోడ్ల సెంటర్ వరకు సమాంతరంగా సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని అదే విధంగా వ్యాపార సముదాయాన్ని అనుకుని పార్కు కంపౌండ్ వాల్ వరకు స్టీలు గేట్లు ఏర్పాటు చేయాలని, తద్వారా వాహనాలు లోపలికి రాకుండా ఉంటాయని దేవస్థానం ప్రధాన వీధిలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి రోడ్డుమీద లేకుండా ఏర్పాటు చేయాలని, వ్యాపార సముదాయం ప్రారంభంలో ఖాళీగా ఉంచిన స్థానంలో ఉచిత మినరల్ ప్లాంట్ ఔట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి 24,గంలు అందుబాటులో పోలీస్ కానిస్టేబుల్ ను నియమించాలని వారు డిమాండ్ చేశారు. భక్తుల, యత్రికుల భద్రతా చర్యల్లో భాగంగా మఠం పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఉన్న సీసీ కెమెరాలను అందుబాటులోకి తేవాలని వారు కోరారు. ఐదు రోడ్ల సెంటర్లో వాహనాలు అడ్డదిడ్డంగా ఉంచడం వల్ల భక్తులు యాత్రికులకే కాక వ్యాపారస్తులకు కూడా ఇబ్బందిగా ఉంటుందని అక్కడ ఒక మఠం సిబ్బందిని ఏర్పాటు చేసి వాటిని నియంత్రించాలని వారు డిమాండ్ చేశారు. ఈ పర్యటన కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సాన గోవిందస్వామి, హరి నాయకులు రాహుల్, శ్రీనువాసులు, భాస్కర్, అరవింద్ ఆంజనేయులు, శ్రీను, రమణ, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# హజ్రత్ షాషా షేక్షావలి తాత ఉరుసు మహోత్సవంలో: గుడిసె ఆది కృష్ణమ్మ





**ఆదోని,జూన్08.అక్షర టైమ్స్:-** ఆదోని మండలంసుల్తానాపురం గ్రామంలో నిర్వహించిన హజ్రత్ షాషా షేక్షావలి తాత ఉరుసు మహోత్సవాల్లో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొని ఈ సందర్భంగా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా జీవించాలని కోరుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉరుసు వేడుకలు మత సామరస్యానికి, సౌభ్రాతృత్వానికి ప్రతీకలని పేర్కొన్నారు. అన్ని మతాల ప్రజలు కలిసి భక్తిశ్రద్ధలతో పాల్గొనడం భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమని అన్నారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావం పెంపొందించడంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.అనంతరం దర్గా నిర్వాహకులు, మత పెద్దలు, భక్తులను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఉరుసు మహోత్సవాల విజయవంతమైన నిర్వహణకు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు నరసింహులు, గౌస్, వెంకటేష్, పురుషోత్తం, మహాదేవ, చంద్ర, వెంకటేష్, భరత్, వీరేష్ తదితరులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఒక ఫోన్ కాల్ ఒక స్పందన ఒక ప్రాణం కాపాడిన శక్తి టీం









**సమయస్ఫూర్తితో యువతి ప్రాణాలు కాపాడిన: కానిస్టేబుల్ రాజేశ్వరి**

**ఆదోని,జూన్08.అక్షర టైమ్స్:-** ఆదోని ఆర్ఆర్ లేబర్ కాలిన నందు ఏర్పాటుచేసిన మహిళలపై జరుగుతున్న దాడులు, గృహ హింస వేధింపులు,బాల్య వివాహాల, వరకట్న వెదింపులు, సైబర్ నేరగాలపై అవేర్నెస్ ప్రోగ్రాం పైమహిళలకు అవగాహన కార్యక్రమం శక్తి టీం సభ్యులు నిర్వహించారు. శక్తి టీం సభ్యుల ఆర్ఆర్ లేబర్ కాలని నందు మీటింగ్ ముగించుకుని, భాష్యం స్కూల్ కి వస్తున్న దారిలో రైల్వే గేటు పరిసర ప్రాంతంలో జీవితంపై నిరాశతో ఆత్మహత్య పాల్పడానికి భావించిన ఓ యువతికి శక్తి టీం సకాలంలో స్పందించి రక్షించింది. ఈ సందర్భంగా శక్తి టీం కానిస్టేబుల్ రాజేశ్వరి మాట్లాడుతూ, యువతి తీవ్ర మానసిక ఒత్తిడితో ఆత్మహత్యకు యత్నించేందుకు సిద్ధమైనట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే స్పందించిన శక్తి టీం యువతిని సంప్రదించి, ఆమెకు ధైర్యం చెప్పి కౌన్సిలింగ్ నిర్వహించామని తెలిపారు. జీవితంలో సమస్యలు శాశ్వతం కావని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని వివరించి యువతి లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించామని ఆమె తెలిపారు. కుటుంబ సమస్యలు అని చెప్పింది. ఎంత సర్ది చెప్పినా వినకపోతే సబంధించిన అధికారులు కు ఇన్ఫర్మేషన్ ఇవ్వడమైనది. అధికారులు ఆదేశాల మేరకు ఆ అమ్మాయిని శక్తి టీమ్ టు వీలర్ పై ఆదోని 3 టౌన్ పీఎస్ లో ఎస్ హెచ్ ఓ వద్ద హాజరు పరచి ఫ్యామిలీ మెంబర్స్ ను పిలిపించి కౌన్సిలింగ్ చేసి, ఫ్యామిలీ మెంబర్స్ కు అపగిచ్చడం జరిగినది ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా ఆత్మహత్య లాంటి ఆలోచనలు చేయకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా పోలీసులను సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు "ఒక్క క్షణం ఆగి ఆలోచిస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.. ఆత్మహత్యకు కాదు, జీవితానికి అవకాశం ఇవ్వాలి" అని కానిస్టేబుల్ రాజేశ్వరి సూచించారు.

## వ్యవసాయ అధికారులు యూరియా

# డిఎపి ఎరువుల విక్రయాలా తనిఖీ





**గోస్పాడు,జూన్08.అక్షర టైమ్స్:-** గోస్పాడు లోని ఎరువుల దుకాణాల్లో ఏడిఏ విజయ్ శేఖర్, మండల వ్యవసాయ అధికారి స్వప్నికా రెడ్డి, ఎరువుల నిలువలను తనిఖీ చేయడం జరిగింది, అందులో భాగంగా 2026 ఖరీఫ్ సీజన్ కి గాను రైతులకు ఏపీఎయిమ్స్ ఆపు ద్వారా సోమవారం నుండి ప్రారంభించామని తెలిపారు. రైతులు భూమి వివరములు రైతు సేవ కేంద్రం సిబ్బంది దగ్గర సరి చూసుకోవాలని, ఖరీఫ్ సీజన్ కు ఏ పంట వేయబోతున్నారు వివరాలను సిబ్బందికి తెలియజేయాలన్నారు. రైతులు ఎరువులను రైతు సేవా కేంద్రంలో కొనుగోలు చేయాలన్నా, ప్రైవేటు దుకాణాలు , సొసైటీలో కొనుగోలు చేయాలన్న రైతు సేవ కేంద్రం సిబ్బంది జాబితాలో ఉంటేనే ఎరువులు కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని వెంటనే వారిని సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి రైతుకు పంట ఆధారంగా యూరియా, డిఏపి పారదర్శకంగా ఇవ్వనున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రామకృష్ణ ,శ్రీధర్ పాల్గొన్నారు.

## ఐఐటి ,జేఈఈ మెయిన్స్, నీట్ పేర్లతో పుస్తకాలను అమ్ముతూ విద్యా వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలి

పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ




**నంద్యాల,జూన్08.అక్షర టైమ్స్:-** కర్నూలు జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ ,ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు ఐఐటి జేఈఈ మెయిన్స్ ,నీట్ పుస్తకాల పేర్లతో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, తక్షణమే విద్యాశాఖ అధికారులు గుర్తింపు రద్దు చేయాలని పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ డిమాండ్ చేశారు.సోమవారం నాడు స్థానిక కర్నూలు కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమం జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ కి పి.డి.ఎస్.యు నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ మాట్లాడుతూ కర్నూలు జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు విచ్చలవిడిగా విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేలాది రూపాయలు అక్రమంగా పుస్తకాల పేరుతో ఫీజులు వసూలు చేస్తున్నాయని, కళాశాలలపైన గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.జూనియర్ కళాశాల యాజమాన్యాలు ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లి తండ్రుల నుండి ఫీజులు వసూలు చేస్తున్నారని, ఎంసెట్, నీట్, జెఈఈలకు అనుమతి లేకున్నా ఐఐటీ, జేఈఈ మెయిన్స్ ,నీట్ అంటూ మోసం చేస్తున్నారని అన్నారు. అక్షరాలతో లక్షల వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ కళాశాలలో అరకొర వసతులతో విద్యను బోధిస్తున్నారని అన్నారు. ఇంటర్ బోర్డు నిబంధనలుకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలను గుర్తించి జూనియర్ కళాశాలల గుర్తింపులు రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఒకే బ్రాంచ్ అనుమతి తీసుకొని రెండు బ్రాంచ్లు నడుపుతున్నారని అన్నారు. .ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు జిల్లా సహాయ కార్యదర్శి సోమశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు షాహీద్,జిల్లా నాయకులు మద్రిస్వామి,ఉరుకుందు,మనోహర్ పాల్గొన్నారు.

## ఎమ్మార్వో కు సన్మానం చేసిన టిడిపి ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాజబాబు



**కౌతాళం,జూన్08.అక్షర టైమ్స్:-** కౌతాళంకు రెగ్యులర్ తహసిల్దార్ గా ప్రమోషన్ పోంది కౌతాళంకు నూతన తహసిల్దార్ గా వచ్చిన రంజినికాంత్ రెడ్డినీ మర్యాద పూర్వకంగా కలిసిన తెలుగుదేశం పార్టీ యస్సిసెల్ జిల్లా కార్యదర్శి రాజాబాబు తదితరులు

## నూతన ఎమ్మార్వో ను కలిసిన ఉరుకుంద టిడిపి నాయకులు



**కౌతాళం,జూన్08.అక్షర టైమ్స్:-** కౌతాళం మండలం తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దారుగా పనిచేస్తున్న రజినీకాంత్ రెడ్డి ,ప్రమోషన్ మీద తిరిగి కౌతాళంకు తహసిల్దార్ గా రావడంతో అభినందిస్తూ, శాలువా, పూలమాలతో సన్మానం చేయడం అయినది.ప్రజలకు మరింత మెరుగైన సేవలు చేయాలని తాసిల్దార్ కి తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో ఉరుకుంద టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## బంగారం ధరలపై ఎగిరి గంతేసే వార్త.. రాబోయే వారంలో మరింత తగ్గనున్న ధరలు..?



బంగారం కొనుగోలు చేసేవారికి గుడ్ న్యూస్ అందనుందా..? రాబోయే వారంలో ధరలు తగ్గనున్నాయా..? అంటే అవుననే అంటున్నారు నిపుణులు. ఫెడ్ సమావేశం, ఇరాన్-అమెరికా మధ్య చర్చలపై అనిశ్చిత నెలకొంది. అలాగే డాలర్ క్రమక్రమంగా బలపడుతోంది. దీంతో ధరలు మరింత పడిపోతాయని అంటున్నారు. బంగారం, వెండి ధరలు మరింత చౌకగా మారనున్నాయా..? రాబోయే వారంలో ధరలు మరింత తగ్గనున్నాయా..? అంటే అవుననే వార్తలు నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి. గత వారం రోజులుగా పసిడి ధరలు పడిపోతూ వస్తోన్నాయి. దీంతో రాబోయే వారంలో కూడా పతనం కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తారు. రాబోయే వారంలో గోల్డ్,సిల్వర్ ధరలు ఒత్తిడిలో కొనసాగవచ్చని అంటున్నారు. ఇందుకు అనేక కారణాలు కూడా చెబుతున్నారు. ఫెడ్ సమావేశం, యూఎస్-ఇరాన్ మధ్య చర్చలు, డాలర్ బలపడటం వల్ల గోల్డ్ రేట్లలో పతనం చూడవచ్చని అభిప్రాయపడుతున్నారు. అలాగే అంతర్జాతీయంగా ముడి చమురు ధరలపై ఇన్వెస్టర్లు ఫోకస్ పెట్టారు. ఈ క్రమంలో బంగారం ధరలపై దీని ప్రభావం పడే అవకాశముందని అంటున్నారు.

ఉద్రిక్తతలు పెరిగితే..

ఇక డాలర్ బలంగా ఉండి అంతర్జాతీయంగా ఉద్రిక్తలు తగ్గితే గోల్డ్ రేట్లు భారీగా తగ్గే అవకాశముంది. ఇక వెండి ధరల్లో కూడా అస్థిరత కొనసాగే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. అయితే కేంద్ర బ్యాంకులు మృదువైన సంకేతాలు ఇచ్చినా లేదా భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగినా పసిడి ధరలు పుంజుకోవచ్చని అంటున్నారు. ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గితే బంగారం, వెండి ధరలు భారీగా కుప్పకూలే అవకాశముందనే సంకేతాలు వినిపిస్తున్నాయి. ఉద్రిక్తతలు తగ్గడం వల్ల బంగారంపై డిమాండ్ తగ్గుతుంది. దీని వల్ల ధరలు తగ్గుతాయని అంటున్నారు. అదే ఉద్రిక్తతలు పెరిగే మాత్రం ధరలు పెరిగే అవకాశముంటుందని నిపుణులు అంచనా వేస్తారు. అలాగే ఇరాన్ హార్ముజ్ జలసంధిపై పరిమితులు విధించింది. అక్కడ ఇంకా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

కొనసాగుతున్న టెన్షన్

హార్ముజ్ జలసంధి వద్ద టెన్షన్ వాతావరణం ఉండటంతో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లు దాటాయి. దీని వల్ల ద్రవ్యోల్బణం పెరిగి మార్కెట్ అస్థిరత పెరిగే అవకాశాలుంటాయని చెప్పవచ్చు. ఇక ఏప్రిల్ 29వ తేదీన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశం జరగనుంది. వడ్డీ రేట్లు, ఆర్థిక సూచిలు, ద్రవ్యోల్బణంపై ఫెడ్ వైఖరిని బట్టి మార్కెట్లు ప్రభావితం అవుతాయి. ఫెడ్ కఠిన వైఖరి ప్రదర్శిస్తే డాలర్ బలపడుతుంది.

## మీరు వాడిన దానికంటే ఎక్కువ కరెంట్ బిల్లు వస్తుందాఒక్క కాల్‌తో సమస్యకు చెక్ పెట్టండిలా..




ఎండలు మండిపోతున్నాయి.. ఇంట్లో ఫ్యాన్లు, ఏసీలు ఫుల్ స్పీడ్‌లో తిరుగుతున్నాయి. అయితే గాలి చల్లగా ఉన్నా.. నెలాఖరున వచ్చే కరెంట్ బిల్లు మాత్రం చెమటలు పట్టిస్తోంది.. మీరు వాడిన దానికంటే ఎక్కువ బిల్లు వస్తోందా మీటర్ రీడింగ్‌లో తప్పులున్నాయని అనుమానంగా ఉందా ఆందోళన వద్దు.. ఒక్క కాల్‌తో మీ సమస్యకు ఎలా చెక్ పెట్టాలో తెలుసుకుందాం. భానుడి భగభగలు మొదలయ్యాయి. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ఇంట్లో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వాడకం విపరీతంగా పెరిగింది. అయితే వీటి వాడకంతో పాటు నెలాఖరున వచ్చే విద్యుత్ బిల్లు కూడా సామాన్యుల జేబుకు చిల్లు పెడుతోంది. చాలా సందర్భాల్లో మనం వాడిన దానికంటే ఎక్కువ బిల్లు రావడం, రీడింగ్‌లో తప్పులు జరగడం చూస్తుంటాం. ఇలాంటప్పుడు ఆందోళన చెందకుండా, మీ హక్కులను ఎలా ఉపయోగించుకోవాలో, బిల్లును ఎలా తగ్గించుకోవాలో ఇప్పుడు చూద్దాం.

**అధిక బిల్లుకు కారణాలేంటి..?**

కేవలం వాడకం పెరగడమే కాకుండా ఇతర సాంకేతిక కారణాల వల్ల కూడా బిల్లు భారీగా రావచ్చు.

మీటర్ లోపాలు: విద్యుత్ మీటర్ మొరాయించడం లేదా వేగంగా తిరగడం.

రీడింగ్ తప్పులు: సిబ్బంది రీడింగ్ తీసేటప్పుడు అంకెలు తప్పుగా నమోదు చేయడం.

బకాయిలు: గత నెల కట్టిన బిల్లు అప్‌డేట్ కాకపోవడం వల్ల, ఆ మొత్తం ప్రస్తుత బిల్లులో కలిసి రావడం.

పరిష్కారం మీ చేతుల్లోనే: హెల్ప్‌లైన్ నంబర్ 1912

విద్యుత్ బిల్లులో ఏవైనా వ్యత్యాసాలు ఉంటే మీరు ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. కేంద్రం దేశవ్యాప్తంగా 1912 అనే ఒకే హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ నుండి 1912కు కాల్ చేసి, మీ కస్టమర్ ఐడి లేదా == నంబర్ చెబితే ప్రతినిధులు ఫిర్యాదు నమోదు చేసుకుంటారు. ఈ నంబర్ రోజులో 24 గంటలూ అందుబాటులో ఉంటుంది.

వాట్సాప్ ద్వారా సులభంగా..

కాల్ చేయడం ఇబ్బందిగా అనిపిస్తే, మీరు వాట్సాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు.

మీ ఫోన్‌లో 8800001915 నంబర్‌ను సేవ్ చేసుకోండి.

అని మెసేజ్ పంపి, అక్కడ వచ్చే ఆప్షన్లలో మీ భాషను ఎంచుకుని ఫిర్యాదు నమోదు చేయండి.

ఫిర్యాదు చేశాక మీకు వచ్చే రిఫరెన్స్ నంబర్ ద్వారా మీ సమస్య ఏ దశలో ఉందో ట్రాక్ చేయవచ్చు. సాధారణంగా 3 నుండి 7 రోజుల్లో అధికారులు మీ ఇంటికి వచ్చి మీటర్ తనిఖీ చేస్తారు.

బిల్లు తగ్గించుకోవడానికి చిట్కాలు

ఫిర్యాదు చేయడంతో పాటు మనం కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే బిల్లును నియంత్రించవచ్చు..

బల్బులు: పాత ఫిలమెంట్ బల్బుల స్థానంలో ==ు బల్బులను వాడండి. ఇవి 80శాతం వరకు విద్యుత్‌ను ఆదా చేస్తాయి.

స్టార్ రేటింగ్: ఏసీ లేదా ఫ్రిజ్ కొనేటప్పుడు 5-స్టార్ రేటింగ్ ఉన్నవి ఎంచుకోండి.సీ టెంపరేచర్: ఏసీని ఎప్పుడూ 24డిగ్రీల నుండి 26డిగ్రీల మధ్య ఉంచడం వల్ల కంప్రెసర్ మీద భారం తగ్గి బిల్లు తక్కువగా వస్తుంది.

అనవసర ప్లగ్స్: వాడనప్పుడు మొబైల్ ఛార్జర్లు, టీవీ స్విచ్‌లు ఆపివేయండి. ప్లగ్ పాయింట్లలో ఉండే లీకేజ్ కరెంట్ కూడా బిల్లు పెరగడానికి కారణమవుతుంది.

## ఆక్సిజన్ సిలిండర్ లేకుండా ఈ రైలు ఎక్కలేరయ్యో.. ప్రపంచంలోనే అత్యంత సాహసోపేత ప్రయాణం ఎక్కడో తెలుసా..?



ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైలు మార్గంలో ప్రయాణించడం అంటే అది కేవలం ఒక ప్రయాణం మాత్రమే కాదు, అదొక గొప్ప సాహసం. సముద్ర మట్టానికి వేల అడుగుల ఎత్తులో, మేఘాల మధ్య సాగే ఈ అద్భుత రైలు ప్రయాణం గురించి వింటే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. టికెట్ ధర సామాన్యులకు అందుబాటులో ఉన్నా, ఈ ప్రయాణానికి గుండె ధైర్యం మాత్రం పుష్కలంగా ఉండాలండోయ్..! ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే లైన్‌గా పేరుగాంచిన క్వింగ్హై-టిబెట్ రైల్వే మార్గం అద్భుతాలకు నిలయం. దాదాపు 1,956 కిలోమీటర్ల పొడవున్న ఈ రైలు మార్గం ప్రయాణికులకు సరికొత్త లోకాన్ని పరిచయం చేస్తుంది. ఈ ప్రయాణంలో రైలు సగటున 4,000 మీటర్ల (సుమారు 13,123 అడుగులు) ఎత్తులో పరుగులు తీస్తుంది. ప్రయాణంలో అత్యున్నత పాయింట్ అయిన 'టాంగులా పాస్' వద్ద రైలు ఏకంగా 5,072 మీటర్ల (16,640 అడుగుల) ఎత్తుకు చేరుకుంటుంది. ఆ సమయంలో మనం భూమిపై ఉన్నామా లేక ఆకాశంలో విహరిస్తున్నామా అన్నంత అనుభూతి కలుగుతుంది.

**ప్రాణవాయువు పడిపోయే ఎత్తులో అత్యాధునిక రక్షణ..**

సాధారణంగా ఇంత ఎత్తులో ఆక్సిజన్ స్థాయిలు భూమిపై కంటే 40 శాతం తక్కువగా ఉంటాయి. శ్వాస తీసుకోవడం చాలా కష్టతరంగా మారుతుంది. అందుకే ఈ రైలును ప్రత్యేకంగా రూపొందించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రైలులో రెండు రకాల ఆక్సిజన్ వ్యవస్థలు పనిచేస్తాయి. ఈ వ్యవస్థల ద్వారా రైలు లోపల ఆక్సిజన్ పరిమాణాన్ని బయటి వాతావరణం కంటే 23 శాతం అదనంగా పెంచుతారు. అయినప్పటికీ, రైలు గరిష్ట ఎత్తుకు చేరుకున్నప్పుడు ప్రయాణికుల సీట్ల పైన ఉండే ఆక్సిజన్ మాస్క్‌లు వాటంతట అవే కిందకు వస్తాయి. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించేందుకు రైలులోనే ఆసుపత్రి తరహా ఏర్పాట్లు ఉంటాయి.

**కనువిందు చేసే ప్రకృతి దృశ్యాలు..**

ఆక్సిజన్ సమస్యలు ఉన్నప్పటికీ, కిటికీ గుండా కనిపించే ప్రకృతి దృశ్యాలు ప్రయాణికుల అలసటను మర్చిపోయేలా చేస్తాయి. బీజింగ్, షాంఘై వంటి నగరాల నుంచి ప్రారంభమై టిబెట్ మంచు కొండల గుండా ఈ రైలు సాగుతుంది. నీలిరంగు ఆకాశం కింద తెల్లటి మంచుతో కప్పబడిన పర్వతాలు, పచ్చని లోయలు ప్రయాణికులకు మరపురాని జ్ఞాపకాలను మిగిలిస్తాయి. ఈ అద్భుత దృశ్యాలను చూడటానికి ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు.

**సామాన్యులకు అందుబాటులో టికెట్ ధరలు..**

ఇంతటి సాహసోపేతమైన, విలాసవంతమైన ప్రయాణానికి లక్షల రూపాయలు ఖర్చవుతాయని అనుకుంటే పొరపాటే. ప్రయాణికుల సౌకర్యార్థం ఇందులో మూడు రకాల తరగతులు ఉన్నాయి:

హార్డ్ సీట్: ఇది అత్యంత చౌకైనది. దీని ధర కేవలం 212 రూపాయలు (360 యెన్లు) మాత్రమే.

హార్డ్ స్లీపర్: దీని టికెట్ ధర సుమారు 425 రూపాయలు (720 యెన్లు).

సాఫ్ట్ స్లీపర్: ఇది అత్యంత విలాసవంతమైనది. ప్రతి క్యాబిన్‌లో 4 బెర్త్‌లు, టీవీ స్క్రీన్, టేబుల్, ప్రతి ప్రయాణికుడికి ప్రత్యేక ఆక్సిజన్ అవుట్‌లెట్ ఉంటాయి. దీని ధర దాదాపు 675 రూపాయలు (1144 యెన్లు).20 నుంచి 22 గంటల పాటు సాగే ఈ సుదీర్ఘ ప్రయాణం ప్రతి ఒక్కరి జీవితంలో ఒక అద్భుతమైన అనుభవంగా మిగిలిపోతుందనడంలో సందేహం లేదు.

## వందే భారత్ బుల్లెట్ ట్రైన్‌పై మరో అప్డేట్.. కేవలం 4 గంటల్లోనే ప్రయాణంఈ రూట్లోనే..













వందే భారత్ బుల్లెట్ రైళ్లను వచ్చే ఏడాదిలో వచ్చే ఏడాదిలో ప్రారంభించేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. ఈ రైళ్లు అత్యంత వేగంగా ప్రయాణిస్తాయి. ప్రస్తుతం ఉన్న వందే భారత్ రైళ్ల తరహాలోనే వీటి డిజైన్ అనేది ఉంటుంది. కానీ బుల్లెట్ రైళ్ల వేగాన్ని ఇవి కలిగలి ఉంటాయి.

రైల్వేశాఖ వచ్చే ఏడాదిలో బుల్లెట్ రైళ్లను తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా వందే భారత్ బుల్లెట్ రైళ్లను తీసుకురానుంది. ఇప్పటికే వందే భారత్, వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్‌లు ఉండగా.. ఇప్పుడు వందే భారత్ బుల్లెట్ రైళ్లను కూడా ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. గంటకు 280 కిలోమీటర్ల వేగంగా ఇవి ప్రయాణిస్తాయి. తొలి రైలు ఢిల్లీ-పాట్నా మధ్య ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు

**1 / 5**

ఇటీవల బెంగళూరులోని బీఈఎంఎల్ ప్లాంట్‌ను రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆదిత్య కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఇది ప్రత్యేక కాంప్లెక్స్ కాగా.. ఇక్కడ బీ28 అని పిలవబడే భారత్ మేడ్ బుల్లెట్ ట్రైన్ సెట్ తయారుకానుంది. ఇక్కడ హైస్పీడ్ రూళ్లు, బీ28 రైళ్లు తయారుచేస్తారు. ఈ కాంప్లెక్స్‌లో తయారయ్యే బీ28 ట్రైన్ సెట్‌ను వందే భారత్ బుల్లెట్ ట్రైన్‌గా పిలుస్తున్నారు.

**2 / 5**

స్వదేశీ టెక్నాలజీతో ఈ వందే భారత్ బుల్లెట్ ట్రైన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ ట్రైన్ చూడటానికి వందే భారత్ రైలు తరహాలో ఉంటుంది. కానీ బుల్లెట్ రైలు వేగాన్ని పోలి ఉంటుంది. దీని వల్ల ఈ రైలుకు వందే భారత్ బుల్లెట్ ట్రైన్‌గా పిలుస్తున్నారు. ఈ ట్రైన్ తయారీని వేగవంతం చేయాలని అధికారులు భావిస్తున్నారు. వచ్చే ఏడాదికల్లా అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు.

3 / 5

మరోవైపు కాంప్లెక్స్ ప్రారంభోత్సవం అనంతరం అశ్విని వైష్ణవ్ మీడియాతో మాట్లాడారు. బీ28 బుల్లెట్ రైలు అనేది స్వయం సమృద్ధి గల వెర్షన్ అని, బీఈఎంఎల్, ఐసిఎఫ్ సంయుక్తంగా డిజైన్ చేశాయన్నారు. బీఈఎంఎల్‌లోనే దీని తయారీ జరుగుతుందని, బుల్లెట్ రైళ్ల తయారీ కోసమే ప్రత్యేకంగా ఆదిత్య కాంప్లెక్స్ రూపొందించామన్నారు. ఇక్కడ అత్యాధునిక యంత్రాలు ఉంటాయని, అవి అత్యంత ఖచ్చితత్వంతో పని చేస్తాయన్నారు. దీనికి అనుగుణంగానే ఇక్కడ పనులు జరుగుతాయని స్పష్టం చేశారు.

**4 / 5**

వందే భారత్ బుల్లెట్ రైలు బెంగళూరు నుంచి చెన్నైకు 73 నిమిషాల్లో చేరుకుంటుంది.